క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మాచర్ల: పట్టణంలోని 11 కేవీ విద్యుత్ లేన్ల మరమ్మతులు, చెట్ల కొమ్మలు తొలగింపులో భాగంగా పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని విద్యుత్ శాఖ అధికారులు సోమవారం తెలిపారు. మంగళవారం ఉదయం 8 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని పేర్కొన్నారు. పట్టణ పరిధిలోని నెహ్రూ నగర్, గుంటూరు రోడ్డు, పార్కు రోడ్డు, రామా టాకీస్, సుద్దడొంక ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందన్నారు.

వంద రోజులు ఉపాధి చూపాలి



మాచర్ల:గ్రామీణ ప్రాంతాల్లో జాతీయ ఉపాధి హామీ పథకం కింద ప్రతి ఒక్కరికి కూలి పనులు కల్పించేలా ఫీల్డ్ అసిస్టెంట్లు, మేట్లు, టెక్నికల్ సిబ్బంది ప్రచార కార్యక్రమం నిర్వహించాలని మండల జాతీయ ఉపాధి హామీ పథకం అధికారి పి.నాగశ్రీనివాసరావు పేర్కొన్నారు. సోమవారం ఉపాధి హామీ పథకం కార్యాలయంలో నిర్వహించిన క్లస్టర్ సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ఫీల్డ్ అసిస్టెంట్లు, మేట్లు జాబ్ కార్డులు లేని వారిని గుర్తించి, వారికి అవగాహన కల్పించాలన్నారు. వేసవి కాలంలో కూలి పనులు కల్పించేలా చూడాలన్నారు. ప్రతి ఒక్కరికి వంద రోజుల ఉపాధి కల్పించాలని స్పష్టం చేశారు.

పాస్టర్‌కు సన్మానం



దాచేపల్లి: మండలంలోని మాదినపాడు తెలుగు బాప్టిస్ట్ చర్చి పాస్టర్ డాక్టర్ కేఎస్ డేవిడ్ రాజ్‌ని సోమవారం ఘనంగా సన్మానించారు. డేవిడ్‌రాజు, రూత్‌కుమారి దంపతులు తెలుగు బాప్టిస్ట్ సంఘాల్లో అందించిన విశిష్ట సేవలకు ఇటీవల వీరిద్దరికి డాక్టరేట్‌ని ప్రదానం చేశారు. ఈ నేపథ్యంలో పాస్టర్‌గా డేవిడ్‌రాజు పని చేస్తున్న మాదినపాడు తెలుగు బాప్టిస్ట్ చర్చి సంఘ పెద్దలు, సంఘస్తులు డేవిడ్‌రాజ్ దంపతులను ఘనంగా సన్మానించారు. ప్రభుసేవలో పనిచేయడం సంతోషంగా ఉందని, తనకు, భార్యకి డాక్టరేట్ ప్రదానం చేయడం వలన పరిచర్యలో తమ బాధ్యత మరింతగా పెరిగిందని డేవిడ్‌రాజ్ పేర్కొన్నారు.

మండల పరిషత్ సర్వసభ్య సమావేశం రేపు

దుర్గి: మండల ప్రజా పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం బుధవారం స్థానిక కార్యాలయంలో ఉదయం 10.30గంటలకు జరుగుతుందని ఎంపీడీఓ శివప్రసాద్ సోమవారం తెలిపారు. ఎంపీపీ సునీతా సాయి శంకర్ అధ్యక్షతన నిర్వహించే సమావేశంలో రానున్న వేసవిలో తాగు నీటి సమస్య, ఉపాధి హామీ పనులపై ప్రధానంగా చర్చిస్తామన్నారు. మండలంలోని ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, జెడ్పీటీసీ సభ్యులు, మండల స్థాయి అధికారులు, సిబ్బంది తప్పనిసరిగా హాజరు కావాలని కోరారు.

రైతు రిజిస్ట్రీలో నమోదు చేసుకోవాలి

ముప్పాళ్ళ: మండలంలోని ఆయా గ్రామాల్లో రైతులు వివరాలను ఫార్మర్ రిజిస్ట్రీలో నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి ఎం.అరుణ సోమవారం చెప్పారు. ఆయా గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల్లో నమోదు ప్రక్రియ జరుగుతుందన్నారు. రైతు ఆధార్‌కార్డు జిరాక్స్, పట్టాదారు పాసుపుస్తకంతో పాటు ఆధార్‌కు లింక్ అయిన ఫోన్ నెంబర్‌తో రైతు సేవా కేంద్రంలోని వ్యవసాయ శాఖ సిబ్బందిని సంప్రదించాలన్నారు. ఆయా వివరాలను ఆన్‌లైన్ చేయటంతో రైతుకు ఐడీ నంబర్ వస్తుందన్నారు. ఈ నంబర్ వలన అనేక ప్రయోజనాలున్నాయని, ప్రభుత్వం అందించే ప్రోత్సాహకాలు, రాయితీలు పొందే అవకాశం ఉంటుందన్నారు. రైతులు త్వరితగతిన రిజిస్ట్రీలో నమోదు చేయించుకోవాలని సూచించారు.

కస్టమర్ కేర్, డేటా ఎంట్రీ కోర్సులకు దరఖాస్తులు

క్రోసూరు: క్రోసూరులోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఏపీఎస్ఎస్‌డీసీ ఆధ్వర్యంలో కస్టమర్ కేర్ డొమెస్టిక్ వాయిస్ కోర్సు, డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సులకు శిక్షణనిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాధికారి అధికారి జి.తమ్మాజీరావు సోమవారం తెలిపారు. ఈ నెల 22వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. పదవ తరగతి ఆపైన చదువుకున్న (18–45 వయస్సు) నిరుద్యోగ యువతీయువకులు దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. కోర్సులో చేరదలిచిన వారు మార్క్స్ సర్టిఫికెట్ జిరాక్స్‌లు, బయోడేటా, ఆధార్, రెండు పాస్‌పోర్ట్ సైజు ఫోటోలు, కాలేజిలో అందజేయాలని కోరారు. వివరాలకు అంజిరెడ్డి 7779858789ని అడిగి తెలుసుకోవాలన్నారు. 50 రోజుల పాటు జరిగే శిక్షణ కాలం పూర్తిచేసుకున్న వెంటనే సర్టిఫికెట్‌తోపాటు ఉపాధి కల్పించబడుతుందన్నారు.

మురుగుకు పరిష్కారం

- వేగంగా మురుగు నీటి శుద్ధి కేంద్రాల నిర్మాణం
- గత ప్రభుత్వంలో పడిన పునాదులు.. ఇప్పటికే ఒక రూపు
- సుమారు రూ. 15 కోట్లతో నిర్మాణ పనులు ముమ్మరం
- పూర్తయితే పిడుగురాళ్లలో తీరనున్న మురుగు నీటి సమస్య
- పట్టణ ప్రజల ఆరోగ్యం పదిలం



పట్టణంలోని ఎస్సీ శ్మశాన వాటిక వద్ద నిర్మిస్తున్న మురుగునీటి శుద్ధి కేంద్రం

పిడుగురాళ్ల: పుర ప్రజలకు మురుగు నీటి సమస్య తీరనుంది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో వేసిన పునాదులు ఇప్పుడు రూపుదాల్చుకుంటున్నాయి. మురుగునీటి శుద్ధి కేంద్రాల నిర్మాణాలు వేగంగా పూర్తి చేసుకుంటున్నాయి. ఇవి పూర్తయితే ప్రజల ఆరోగ్యాన్ని పదిలం చేయడమే కాకుండా నీటి సమస్యను అధిగమించవచ్చు. స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్‌లో భాగంగా పిడుగురాళ్ల పట్టణంలోని రెండు మురుగు నీటి శుద్ధి కేంద్రాలు గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో మంజూరయ్యాయి. వాటి నిర్మాణానికి సుమారు రూ.15 కోట్ల నిధుల చేసింది. మున్సిపల్ అధికారులు స్థలాన్ని కేటాయించడంతో.. మురుగు నీటి శుద్ధి కేంద్రాల నిర్మాణాన్ని కాంట్రాక్టర్లు ప్రారంభించారు.

పిడుగురాళ్లకు రెండు శుద్ధి కేంద్రాలు..

పట్టణంలోని చెరువు కట్ట సమీపంలోని ఎస్సీల శ్మశాన వాటిక స్థలంలో ఒక మురుగు నీటి శుద్ధి కేంద్రాన్ని నిర్మిస్తున్నారు. మరొకటి రైల్వే ఓవర్ బ్రిడ్జి సమీపంలో నిర్మాణం జరుగుతోంది. ఎస్సీ శ్మశాన వాటికలో నిర్మిస్తున్న మురుగునీటి శుద్ధి కేంద్రం రూ. 5.9 ఎంఎల్‌టీ సామర్థ్యం, అలాగే రైల్వే ఓవర్ బ్రిడ్జి సమీపంలో నిర్మిస్తున్న మురుగునీటి శుద్ధి కేంద్రం 5.2 ఎంఎల్‌టీ సామర్థ్యం కలిగి ఉన్నాయి.



పట్టణంలోని రైల్వే ఓవర్ బ్రిడ్జి సమీపంలో రెండవ శుద్ధి కేంద్రం నిర్మాణం

మురుగు నీటి సమస్యకు పరిష్కారం

మురుగునీటి శుద్ధి కేంద్రాల నిర్మాణం వల్ల ప్రజల ఆరోగ్యాన్ని కాపాడవచ్చు. అలాగే పట్టణంలో ఉన్న డ్రెయినేజీ నీటిని శుద్ధి చేసేందుకు ప్రత్యేక ప్రణాళికతో వీటిని నిర్మిస్తున్నారు. మురుగు నీటిని శుద్ధి కేంద్రాల్లో ఫిల్టర్ చేయడం వల్ల మంచి నీరుగా మారుస్తారు. శుద్ధి చేసిన నీరు వాగులు, కాల్వలు, కుంటలు, చెరువుల్లోకి వదలుతారు. ఈ నీటిని పశువులు తాగటానికి, పంట పొలాల్లో సాగునీటికి ఉపయోగించుకునే అవకాశం ఉంటుంది. భవిష్యత్తులో ఈ మురుగునీటి శుద్ధి కేంద్రాల ద్వారా నీటిని మరింతగా ఫిల్టర్ చేసి, మనుషులు ఉపయోగించుకునే విధంగా ఉపయోగపడుతుందని అధికారులు చెబుతున్నారు.

రెండేళ్లల్లో నిర్మాణాలు పూర్తి

పట్టణంలో నిర్మిస్తున్న ఈ మరుగునీటి శుద్ధి కేంద్రాలు ప్రారంభించిన నాటి నుంచి రెండేళ్లల్లో నిర్మాణాలు పూర్తి చేసి, ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలి. ఇప్పటికే బెడ్ నిర్మాణ పనులు జరుగుతున్నాయి. త్వరలోనే పూర్తిస్థాయిలో ప్రజలకు అందుబాటులోకి తీసుకొని వచ్చే విధంగా అధికారులు ప్రయత్నిస్తున్నారు.

నీటి సమస్యకు పరిష్కారం

> శుద్ధి కేంద్రాలు పిడుగురాళ్ల పరిధిలో రెండు మంజూరయ్యాయి. స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ద్వారా ఈ నిర్మాణాలు జరుగుతున్నాయి. ఇవి పూర్తి అయితే మురుగు నీటి సమస్యకు పరిష్కారం లభిస్తుంది. తద్వారా ప్రజలు ఆరోగ్యంగా ఉండేందుకు కూడా ఉపయోగకరంగా ఉంటుంది.
>
> – రాఘవేంద్ర, మున్సిపల్ ఏఈ, పిడుగురాళ్ల

మరమ్మతులన్నారు.. మధ్యలోనే మరిచారు



తవ్విన రోడ్డుపై వస్తున్న వాహనాలు

దాచేపల్లి: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సంక్రాంతి నాటికి గుంతలు లేని రోడ్లు లేని రాష్ట్రంగా అభివృద్ధి చేస్తామని నేతలు ప్రగల్భాలు పలికారు. గత నెలలో సంక్రాంతికి ముందు దాచేపల్లి–తంగెడ రోడ్డులో గుంతలు ఏర్పడటంతో తవ్వారు. దాచేపల్లి నుంచి 15 కిలోమీటర్ల మేర దాదాపుగా రోడ్డు అంతటిని తవ్వేసి మర్మతులు చేస్తామని కూట మినేతలు, అధికారులు విస్తృతంగా ప్రచారం చేశారు. యంత్రాలతో రోడ్డునైతే తవ్వేశారు కానీ, మరమ్మతులు చేపట్టడం పూర్తిగా మరచిపోయారు. ఈ రోడ్డు మీదుగా ముత్యాలంపాడు, తంగెడ అక్కడ నుంచి తెలంగాణ రాష్ట్రంలోకి వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఈ రోడ్డులోనే సిమెంట్ పరిశ్రమలు అధికంగా ఉండటంతో వాహనాల రద్దీ కాస్త ఎక్కువగానే ఉంటుంది. ప్రస్తుతం ఈ రోడ్డుని తవ్వటం వల్ల వాహనాల రాకపోకలకు బాగా ఇబ్బందులు కలుగుతున్నాయి. రోడ్డుని తవ్వి నెలల గడుస్తున్న మరమ్మతులు చేయకుండా అలాగే వదిలేశారు. రోడ్డుపై విపరీతమైన దుమ్మూ ధూళీ లేవడం వల్ల వాహనదారులు ముందుకు వెళ్లలేకపోతున్నారు. ద్విచక్ర వాహనదారులను దుమ్మూధూళి కమ్మేస్తోంది. నెలలు గడుస్తున్న రోడ్డుకి మరమ్మతులు చేపట్టకపోవడంపై ప్రజలు ప్రభుత్వం తీరుపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైన ప్రభుత్వం స్పందించి మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ఇంటింటికి ఆరోగ్యం



పిడుగురాళ్ల: పట్టణంలోని అన్ని సచివాలయాల పరిధిలో ఇంటింటికి ఆరోగ్యం సర్వేను నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలోనే పట్టణంలోని 11వ సచివాలయ పరిధిలోని చితిరాల వీధిలో ఎన్‌సీడీ స్క్రీనింగ్ సర్వే డోర్ టూ డోర్ ఆరోగ్య పరీక్షలు సోమవారం నిర్వహించారు. ఈ సర్వేలో ప్రజలకు బీపీ, షుగర్, క్యాన్సర్, బీపీ, హెచ్‌బీ వంటి పరీక్షలు నిర్వహించి, అనారోగ్య సమస్యలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. తద్వారా వైద్య సేవలు ఉచితంగా అందించేందుకు అవకాశం ఉంటుందని సచివాలయ హెల్త్ సెక్రటరీ ఎస్‌కే బషీరూన్ తెలిపారు. ఆశ కార్యకర్తలు ఎం.శ్వేత, ఎస్.శారదా పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



మాచర్ల:ఉద్యోగులకు గత ఆరు సంవత్సరాలుగా రావాల్సిన డీఏ ఏరియర్స్ వెంటనే విడుదల చేయాలని ఏపీ సీపీఎస్సీ రాష్ట్ర అధ్యక్షుడు బాజీ పఠాన్ ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం బాజీ పఠాన్, రాష్ట్ర మహిళ అధ్యక్షురాలు డాక్టర్ సాంబేలు శాంతి బాయి సీఎఫ్ఎంఎస్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ నివాస్‌ను సెక్రటేరియట్‌లో కలిసి వినతి పత్రం అందజేశారు. సమస్యను తెలిపారు. వారు మాట్లాడుతూ 12 డీఏ బకాయిలు వాయిదా వేయడం చాలా అన్యాయమన్నారు. ప్రతి ఉద్యోగి ఆత్మగౌరవంతో ఒక వృత్తిని నిర్వహిస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలంటే వారికి న్యాయబద్ధంగా రావాల్సిన బకాయిలు చెల్లించాలని కోరారు. నివాస్‌ను కలిసిన వారిలో హుస్సేన్, నాగేశ్వరరావు, బాలాజీ నాయక్, యూనియన్ నాయకులు ఉన్నారు.

వెంటనే పెన్షనర్ల బకాయిలు విడుదల చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న రామకృష్ణారావు

మాచర్ల రూరల్:రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ డీఏ, పీఆర్‌సీ బకాయిలను వెంటనే విడుదల చేయాలని రాష్ట్ర పెన్షనర్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి గాదె రామకృష్ణారావు కోరారు. సోమవారం పట్టణంలోని పెన్షనర్స్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో పాల్గొని ప్రసంగించారు. గత ప్రభుత్వంలో పెన్షనర్లకు ఎంతో నష్టం జరిగిందన్నారు. క్యాంటం ఆఫ్ పెన్షన్‌ని తగ్గించి ఎంతో నష్టపరచారని వెంటనే సరిచేయాలన్నారు. అసోసియేషన్ అధ్యక్షుడు నందా నరసింహ్మయ్య మాట్లాడుతూ ఈహెచ్‌ఎస్ కార్డుపై ఉచిత వైద్యం దక్కడం లేదన్నారు. అది యథాస్థితిపై పునరుద్ధరించాలని కోరారు. మూడు డీఏలను ప్రభుత్వం వెంటనే ప్రకటించాలని కోరారు. ఇకపై ప్రతి నెల వారి సమావేశంలో డాక్టర్ రామలింగారెడ్డి కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో ప్రధాన కార్యదర్శి చంద్రయ్య, ట్రెజరర్ షేక్ గాలీబ్, సహాయ కార్యదర్శి అంజయ్య, వెంకటరెడ్డి, నారాయణ, లక్ష్మణరావు, రవికాంత్, జాని, వెలుగొండరెడ్డి తదితరులున్నారు.

కరాటేలో ‘ఆదర్శ’ విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపల్ రవికుమార్

దాచేపల్లి : స్థానిక ప్రభుత్వ ఆదర్శ పాఠశాల విద్యార్థులు కరాటే పోటీల్లో ప్రతిభ చూపించారని ప్రిన్సిపల్ ఎస్. రవికుమార్ సోమవారం తెలిపారు. ఆర్‌బీ డ్రాగన్స్ బుడోఖాన్ కరాటే అసోసియేషన్ ఆధ్వర్యంలో అండర్–14 విభాగంలో బాల, బాలికలకు అద్దంకిలో జరిగిన జాతీయ స్థాయి ఓపెన్ కరాటే పోటీల్లో ఆదర్శ పాఠశాలలో 6వ తరగతి చదువుకుంటున్న చెట్టిపాగు మిషిత బ్లెస్సీ గ్రూప్–ఏ బాలికల విభాగంలో మొదటిస్థానం, గ్రూప్–బీ విభాగంలో సువర్ణ రెండవ స్థానం, గ్రూప్ సీ నుంచి ఎల్.శరణ్య మొదటిస్థానం, గ్రూప్ డీ నుంచి మురికిపూడి ఆలేఖ్య మూడవ స్థానం, గ్రూప్ ఎఫ్ నుంచి చెట్టిపాగు రితీష్ రెండవ స్థానంలో నిలిచారని ఆయన వెల్లడించారు. విజేతలుగా నిలిచిన విద్యార్థులను కోచ్ మీసాల అచ్చయ్య, పీఈటీ బాలాజీనాయక్ అభినందించారు.

అప్రమత్తత అవసరం



బర్డ్ ఫ్లూ భయంతో ఖాళీగా ఉన్న ఓ కోళ్ల ఫారం

నకరికల్లు: నిన్నటివరకు ఆరోగ్యంగా గెంతులేస్తున్న కోళ్లు గంటల వ్యవధిలోనే మృత్యువాత పడుతున్నాయి. ఏమవుతుందో తెలుసుకునే లోపే టపాటపా రాలిపోతున్నాయి. కోడి మేత మేయకుండా మెత్తగా కన్పించడం తెల్లవారే సరికి మృతి చెందడం.. ఇది ప్రస్తుత పరిస్థితి.. దీనిని వైద్య పరిభాషలో బర్డ్ ఫ్లూ వ్యాధిగా పరిగణిస్తున్నారు. బర్డ్ ఫ్లూ వ్యాధి సోకిన గంటల వ్యవధిలోనే కోళ్లు మృతి చెందడంతో పాటు పక్కన ఉన్న కోళ్లకు సైతం సోకుతుంది. బర్డ్ ఫ్లూ సోకిన 10 కిలోమీటర్ల పరిధి వరకు ఈ వైరస్ వ్యాపిస్తుంది. కోళ్లకే కాదు మనుషులకూ ఈ వ్యాధి సోకే ప్రమాదముందని వైద్యులు చెబుతున్నారు. దీంతో కోళ్ల పెంపకందారులు అలాగే చికెన్ ప్రియుల్లో ఆందోళన ఆవహించింది.

వ్యాధి లక్షణాలు ఇలా...

బర్డ్ ఫ్లూ అనేది అంటు సంబంధిత వ్యాధి. ఇది సాధారణంగా కోళ్లలో వ్యాప్తి చెందుతుంది. ఒక కోడి నుంచి మరొక కోడికి క్షణాల్లో వ్యాప్తి చెంది ప్రాణాలను హరిస్తుంది. ఈ వైరస్ 10 కిలోమీటర్ల పరిధిలో వ్యాప్తి చెందుతుంది. సాధారణంగా గాలిలో మార్పు ద్వారా ఈ వ్యాధి వస్తుంది. తీవ్ర జ్వరంతో నీరసించి పోయి మేత మేయకుండా కోళ్లు కన్పిస్తాయి. వ్యాధి లక్షణాలు కన్పించిన కొద్ది గంటల వ్యవధిలోనే మృత్యువాత పడతాయి. ఒక కోడికి వ్యాధి లక్షణాలు కన్పిస్తే పక్క కోళ్లకు 90 శాతం పైగా వ్యాధి సోకే ప్రమాదముంది. మిగిలిన వాటిని కూడా తొలగించడం మంచిది.

మనుషులకూ సోకే అవకాశం

గాలి ద్వారా వ్యాప్తి చెందే బర్డ్ ఫ్లూ వ్యాధిని జూరోటిక్ డిసీజ్‌గా చెబుతారు. కోళ్లలో మాదిరిగానే మనుషుల్లో ఈ వ్యాధి సోకితే అవే లక్షణాలు కన్పిస్తాయి. తీవ్రమైన జ్వరం, శ్వాస సంబంధిత సమస్యలు ఏర్పడతాయి. సకాలంలో వైద్యం తీసుకోవాల్సిన పరిస్థితి ఉంటుంది. వ్యాధి సోకిన కోళ్లను కోయడం ద్వారా వ్యాధి మరింత వేగంగా వ్యాప్తి చెందుతుంది. బర్డ్ ఫ్లూకు నివారణే శ్రేయస్కరమైన మార్గం.

అప్రమత్తంగా ఉండాలి



> బర్డ్ ఫ్లూ వ్యాధి విపరీతంగా వ్యాప్తి చెందుతున్న నేపథ్యంలో మాంసాహార ప్రియులు అప్రమత్తంగా ఉండాలి. గాలి ద్వారా వచ్చే బర్డ్ ఫ్లూ వ్యాధి క్షణాల్లో ఒక కోడి నుంచి మరొక కోడికి వ్యాప్తి చెందుతుంది. వ్యాధి లక్షణాలు గుర్తించిన 10 కిలోమీటర్ల పరిధిలో వైరస్ ప్రభావం ఉంటుంది. వైరస్ సోకి ఉన్న కోడిని చికెన్ కోసం కోయడం ద్వారా మరింతగా వ్యాప్తి చెందుతుంది. మనుషులకు వ్యాప్తి చెందే అవకాశాలు ఉన్నాయని పరిశోధనలు చెబుతున్నాయి.
>
> – డాక్టర్ సుజాత, పశువైద్యాధికారి, దేవవరం

తగ్గిన చికెన్ ధరలు

బర్డ్ ఫ్లూ భయంతో చికెన్ ధరలు భారీగా తగ్గిపోయాయి. గత ఐదారు రోజుల క్రితం వరకు రూ.230–240 వరకు పలికిన స్కిన్‌లెస్ చికెన్ ధరలు ప్రస్తుతం గణనీయంగా తగ్గిపోయాయి. ఆది, సోమవారాల్లో రూ.130–140కు విక్రయిస్తున్నారు. ఈ ధరలు మరింత తగ్గే అవకాశం ఉంది. బర్డ్ ఫ్లూ వ్యాధి వ్యాప్తి చెందుతున్న నేపథ్యంలో ఉన్న కోళ్లను ఎంతో అంతకు అమ్మి సొమ్ము చేసుకునేందుకు చికెన్ వ్యాపారులు ధరలు తగ్గించి ఆకర్షిస్తున్నారు.

ప్రశాంత వాతావరణంలో తిరునాళ్ల

జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు



ఎస్పీ శ్రీనివాసరావును సన్మానిస్తున్న బ్రహ్మంగారి మఠాధిపతి వీరబ్రహ్మాచారి

కారెంపూడి: మండలంలోని ఒప్పిచర్ల గ్రామంలో శ్రీమద్విరాట్ పోతూలూరి వీరబ్రహ్మేంద్ర స్వాముల తిరునాళ్ల సందర్భంగా పల్నాడు జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు సోమవారం గ్రామాన్ని సందర్శించారు. ముందుగా వీరబ్రహ్మేంద్ర స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. సోమవారం నుంచి గ్రామ తిరునాళ్ల ప్రారంభమైన సందర్భంగా శాంతి భద్రతలను సమీక్షించారు. ఎస్పీ శ్రీనివాసరావుకు మఠాధిపతి ఎం వీరబ్రహ్మాచారి మఠ సంప్రదాయం ప్రకారం ఘన స్వాగతం పలికారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ ప్రశాంత వాతావరణంలో తిరునాళ్లను ఆనందంగా నిర్వహించుకోవాలని గ్రామస్తులను కోరారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్న కారణంగా ప్రభలపై రాజకీయ పార్టీల జెండాలను కట్టవద్దని అలాగే రాజకీయ నాయకుల ప్రసంగాలు ప్రభలపై చేయవద్దన్నారు. కోడ్ ఉల్లంఘనలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని ఎస్పీ శ్రీనివాసరావు హెచ్చరించారు. ఈ సందర్భంగా డీఎస్పీ జగదీష్, సీఐ శ్రీనివాసరావు, ఎస్ఐ వాసు తిరునాళ్ల సందర్భంగా గ్రామంలో ఏర్పాటు చేసిన బందోబస్తు ఏర్పాట్లను ఎస్పీకి వివరించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఎస్పీ పోలీస్ అధికారులను ఆదేశించారు.

వైభవంగా కల్యాణ మహోత్సవాలు



వేణు గోపాల స్వామి కల్యాణం

మిట్టగుడిపాడు(రెంటచింతల):మండలంలోని మిట్టగుడిపాడు గ్రామంలో వేంచేసిన అతి పురాతనమైన భ్రమరాంబ సమేత నాగేశ్వర స్వామి దేవస్థాన తిరునాళ్ల ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా శివపార్వతుల శాంతి కల్యాణ మహోత్సవం, సంతాన వేణుగోపాల స్వామి ఆలయంలో రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాల స్వామివారి 17వ వార్షిక కల్యాణ మహోత్సవాలు సోమవారం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఆలయాల అర్చకులు వెల్లటూరి నాగేశ్వరశర్మ, వడ్డమాను రమణాచార్యులు నేతృత్వంలో పలువురు వేద పండితులు వేకువ జాము నుంచి సుప్రభాత సేవ, గణపతి పూజ, మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు, స్వామివార్లకు పంచామృతాభిషేకాలు, విష్వక్సేన ఆరాధన నిర్వహించారు. దేవదాయ శాఖ ఆధ్వర్యంలో జిగురు శంకర శర్మ, బ్రహ్మశ్రీ కృష్ణకాంత్ స్వామివార్లకు కల్యాణం జరిపించారు. దంపతులు పీటలపై కూర్చుని పాల్గొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని, కల్యాణాన్ని తిలకించారు. అన్నదానం చేశారు. విద్యుత్ ప్రభలు, సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ఎండోమెంట్ ఈవో గాదె రామిరెడ్డి, ఆలయాల కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఎస్ఐ సీహెచ్ నాగార్జున అవాంఛనీయ ఘటనలు తలెత్తకుండా బందోబస్తు నిర్వహించారు.

అంగన్‌వాడీ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి



సూపర్‌వైజర్‌కు వినతి పత్రం అందజేత

పిడుగురాళ్ల: అంగన్‌వాడీ వర్కర్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలని జిల్లా నాయకులు ఏపూరి గోపాలరావు అన్నారు. పట్టణంలోని ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో ప్రాజెక్టు సూపర్‌వైజర్‌కు అంగన్‌వాడీ వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని వినతిపత్రం సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అంగన్‌వాడీ వర్కర్ల యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు పిడుగురాళ్ల ప్రాజెక్టు కమిటీ ఆధ్వర్యంలో సమ్మె కాలుపు డిమాండ్లు అమలు చేయాలని, సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం గ్రాడ్యూటీని అమలు చేయాలని, మినీ సెంటర్లో మెయిన్ సెంటర్‌గా మార్చాలని, ఆయాలను ప్రాజెక్టు ఆఫీసులో పని చేయించకుండానికి నిలపుదల చేయాలని డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని సెక్టార్ సూపర్‌వైజర్ నాగమణికి సూచించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మండల నాయకులు టి. శ్రీనివాసరావు, అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు డి.కాంతమణి, షేక్ హజ్ర శివరంజని, భవాని, రాధిక, శైలజ, బాజీబి, బుజ్జి, రమణ, శైలజ, అరుణ పాల్గొన్నారు.

హెల్మెట్ ధరించండి.. ప్రాణాలు కాపాడుకోండి

ఎస్ఐ నాగేంద్రరావు



ద్విచక్ర వాహనాలదారులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ నాగేంద్రరావు

క్రోసూరు: ద్విచక్ర వాహనాలు నడిపే ప్రతి ఒక్కరు తప్పక హెల్మెట్ ధరించండి, ప్రాణాలు కాపాడుకోండి అని ఎస్ఐ నాగేంద్రరరావు సోమవారం వాహనదారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెల్మెట్ ధరించాల్సిన ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. రోడ్డు పై ప్రయాణించేటప్పుడు ప్రాణాపాయ ప్రమాదాల నుంచి హెల్మెట్ కాపాడుతుందని తెలిపారు. మితిమీరిన వేగంతో వాహనాలు నడపటం, మద్యం తాగి నడపటం, మైనర్లు వాహనాలు నడపటం, సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ నడపటం కారణంగా ప్రమాదాలు జరిగి తల రోడ్డుకు తగిలి అనేక మంది ప్రాణాలు కోల్పోతున్నారన్న విషయం అందరికీ తెలుసునన్నారు. కావున ద్విచక్ర వాహనదారులు తప్పక హెల్మెట్ హెల్మెట్ ధరించి ప్రాణాలు కాపాడుకోవాలని తెలియజేశారు. రవాణా చట్టం ప్రకారం హెల్మెట్ లేకుండా ప్రయాణిస్తే అధిక జరిమానా విధించటం జరుగుతుందన్నారు. కావున ప్రతి ఒక్క ద్విచక్ర వాహనదారు హెల్మెట్ ధరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పోలీసులు పాల్గొన్నారు.

ప్రతి కుటుంబానికి వంద రోజులు పని కల్పించాలి



మాట్లాడుతున్న జిల్లా నీటి యాజమాన్య సంస్థ పీడీ లింగమూర్తి

జిల్లా నీటి యాజమాన్య సంస్థ పీడీ సిద్దలింగమూర్తి

సత్తెనపల్లి: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద ప్రతి కుటుంబానికి వంద రోజులు పని కల్పించాలని పల్నాడు జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ సిద్దలింగమూర్తి అన్నారు. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంపై సత్తెనపల్లి నియోజకవర్గ స్థాయి సమీక్ష సమావేశం పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం జరిగింది. ఈ సందర్భంగా పీడీ లింగమూర్తి ఫారం పాండ్లు, ఇంకుడు గుంతలు, ప్రతి కుటుంబానికి వంద రోజులు పని కల్పించడం, సరాసరి వేతనం, గోకుల షెడ్లు, శ్రమశక్తి సంఘాలు, గృహ నిర్మాణాలకు 90 రోజుల పని దినాలు, ఉద్యానవన పంటలు, లేబర్ బడ్జెట్‌పై అంశాల వారీగా సమీక్ష చేశారు. సమావేశంలో సత్తెనపల్లి ఎంపీడీవో బండి శ్రీనివాస రెడ్డి, రాజుపాలెం ఎంపీడీవో జీవీ సత్యనారాయణ, నకరికల్లు ఎంపీడీవో కాశయ్య, సత్తెనపల్లి క్లస్టర్ ఏపీడీ ఇన్‌చార్జ్ పొత్తూరి వెంకటనారాయణ, నియోజకవర్గంలోని ఉపాధి హామీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ప్రత్యేక ఆధార్ క్యాంపులు

మాచర్ల: పట్టణంలో ప్రత్యేక ఆధార్ క్యాంపు మంగళవారం నుంచి ఈ నెల 21వ తేదీ వరకు ఏర్పాటు చేస్తున్నామని పురపాలక సంఘ కమిషనర్ డి.వేణుబాబు సోమవారం తెలిపారు. జెండా చెట్టు బజారు, పూర్ణయ్య షెడ్డు, రూప్‌వే కాలనీ ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు క్యాంపులు నడుస్తాయని వెల్లడించారు.